‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

ఆర్ఎంపీ, పీఎంపీలపై కక్షసాధింపు తగదు

మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్

డిచ్‌పల్లి, జనవరి 29 : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీపై కక్ష సాధింపు చర్యలు తగదని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. టీఎస్ఎంసీ చేపడుతున్న దాడుల నేపథ్యంలో జిల్లా స్థాయి అత్యవసర సమావేశాన్ని డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. 24 గంటల పాటు ప్రజలకు పీఎంపీ, ఆర్ఎంపీలు వైద్యసేవలందిస్తున్నారని అన్నారు. పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, గ్రామీణ వైద్యులపై దాడులు చేసి, కేసులు నమోదు చేస్తే రాష్ట్రస్థాయిలో ఆందోళన చేస్తామని తీర్మానించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజగోపాలాచారి, కిషన్, సాయిలు, శ్రీనివాస్, రాజు, సాయిబాబా, భాస్కర్, భోజరాం, రాఘవేందర్, రాములు, ప్రకాశ్, మోహన్, నవీన్ పాల్గొన్నారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, జనవరి 31 : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 10న జిల్లావ్యాప్తంగా 1-19 ఏండ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. జిల్లాకేంద్రంలోని జీజీహెచ్‌లో ప్రోగ్రాం, మెడికల్ ఆఫీసర్లు, మండల విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి, నులిపురుగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈనెల 10న మాత్రలు వేసుకోని పిల్లలకు, 17న తప్పనిసరిగా వేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రమేశ్, డాక్టర్ రాజు, అంజన్న, డాక్టర్ వినీత్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ సచిన్, జిల్లా ఆరోగ్య విద్య శిక్షకుడు వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ వెంకటేశం, దీపిక పాల్గొన్నారు.

యువతి మృతి కేసులో వైద్యాధికారుల విచారణ

మహాలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సీజ్

మాక్లూర్, జనవరి31: మండలంలోని కల్లడిలో ఆర్ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించడంతో గ్రామానికి చెందిన ఆయేషా మృతి చెందిన కేసు విచారణలో భాగంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సంజన తన సిబ్బందితో కలిసి శుక్రవారం గ్రామానికి వచ్చారు. మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్లడి గ్రామానికి చెందిన యువతి మెండోరా మండలానికి చెందిన ఒకరిని ప్రేమించింది. ఈక్రమంలో ఆమె గర్భందాల్చింది. ఎలాగైనా అబార్షన్ చేయించుకోవాలని నిర్ణయించుకొని కల్లడి గ్రామంలోని శ్రీమహాలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఆర్ఎంపీ వైద్యుడు సునీల్‌వర్మను వారు సంప్రదించారు. చికిత్సకు సంబంధించిన వివరాల సేకరణకు డిప్యూటీ డీఎంహెచ్‌వో తన సిబ్బందితో వచ్చారని సీహెచ్‌వో ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఆర్ఎంపీ స్థానికంగా లేకపోవడంతోపాటు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో క్లినిక్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో సీజ్ చేశారు. ఆమె వెంట వైద్య సిబ్బంది వేణుగోపాల్, జేమ్స్, జీపీ కార్యదర్శి చంద్రశేఖర్, రాంకిషన్‌రావు, సిబ్బంది ఉన్నారు.



శ్రీ మహాలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

తొమ్మిదైనా.. కానరాని చెత్తబండి!

- సమయపాలన లేకుండా చెత్త సేకరణ
- ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి
- అయోమయంలో నగరవాసులు

రిపేరు కోసం షెడ్‌లో ఉన్న చెత్త సేకరించే వాహనాలు

కంటేశ్వర్, జనవరి 31 : జిల్లా కేంద్రంలో చెత్త సేకరణ సమయపాలన లేకుండా చేపడుతున్నారు. కొన్ని డివిజన్లలో రోజూ ఉదయంవేళ చెత్తను సేకరించే బండ్లు ఏ సమయంలో వస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటలలోపు రావాల్సిన చెత్త బండ్లు మధ్యాహ్నం మూడు నాలుగు గంటల ప్రాంతంలో వస్తున్నాయి. ఉదయం పూట ఉద్యోగాలకు వెళ్లే వారు చెత్త బండ్లు ఏ సమయంలో వస్తున్నాయో తెలియక ఇండ్లలోనే ఉంచుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయపాలన లేకుండా చెత్తవాహనాలు వస్తున్నాయని డ్రైవర్లను అడిగితే వెహికిల్స్ రిపేర్‌లో ఉన్నాయని, అందుకే ఆలస్యమవుతున్నదని చెప్పడం గమనార్హం.

జిల్లా కేంద్రంలో మొత్తం 60 డివిజన్లలో చెత్త సేకరణకు ప్రతి డివిజన్‌కు ఒక ఆటో ఉండగా.. దాదాపుగా 15 ఆటోలు ఎప్పుడూ మరమ్మతుల పేరిట షోరూంలో ఉండడం గమనార్హం.

మరమ్మతుల బకాయిలు రూ.5.5 లక్షలు

చెత్త సేకరణ వాహనాల మరమ్మతులకు సంబంధించిన బిల్లులు దాదాపు రూ.5.5 లక్షలు బకాయిలు ఉన్నట్లు తెలిసింది. బకాయిలు పేరుకుపోవడంతో మరమ్మతులు చేపట్టడంలో జాప్యం నెలకొంటున్నది. ఈ విషయమై నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. రూ. 5.5 లక్షల బకాయిలు ఉన్నాయని, తాము మరమ్మతులు చేయించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించడం లేదన్నారు. బిల్లు చెల్లింపు అనేది సైక్లింగ్ పద్ధతి ప్రకారం కొనసాగుతుందని చెప్పారు.

స్వీయ నియంత్రణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంటేశ్వర్, జనవరి 31 : స్వీయ నియంత్రణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగానే రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగి ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. యువత ఇష్టారీతిన వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృతంగా అవవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నెలరోజుల పాటు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ కిరణ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

నవీపేట, జనవరి 31: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. నవీపేటలోని బాలుర, నాగేపూర్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో అశోక్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి, జనవరి 31 : రోడ్డు భద్రతా మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో-1లో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీటీవో ఉమామహేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. ప్రమాదరహిత సర్వీస్ రికార్డు కలిగిన డ్రైవర్లను సన్మానించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కిరణ్‌కుమార్, జ్యోత్స్న, శంకర్, సరస్వతి, పద్మజ, ఆనంద్, సాయన్న, శ్రీనివాస్, సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

సిబ్బందికి సూచనలు చేస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్,జనవరి31: వైద్యాధికారి, సిబ్బంది సమయపాలన పాటించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మహతో సూచించారు. బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్ సెంటర్, ల్యాబ్, వార్డులను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమతకు సూచనలు చేశారు. పీహెచ్‌సీతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి నిర్మల, సిబ్బంది ఉన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఉత్తర్వులు జారీ చేయాలి

కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్న వీఆర్ఏలు, వారసులు

కంటేశ్వర్, జనవరి 31 : బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవోఎంఎస్ నంబర్ 81, 85 ప్రకారం 3,797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేయాలని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద భవిష్యత్తు కార్యాచరణపై శుక్రవారం సన్నాహాక సమావేశం ఏర్పాటు చేశారు. వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు ఇస్తారి గంగమల్లు మాట్లాడుతూ... వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. 14 నెలలుగా 20,555 మంది వీఆర్ఏలు చేయాల్సిన విధులను 3,797 మంది మాత్రమే చేపడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించి, వీఆర్ఏలను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు గోధుమల మోహన్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లకు ప్రథమస్థానం

కంఠేశ్వర్, జనవరి 31 : మెదక్ జిల్లాలోని తుప్రాన్‌లో ఉన్న ఒలంపియాడ్ స్కూల్‌లో గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన 68వ స్కూల్‌గేమ్స్ రాష్ట్ర అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు విజయం సాధించాయి. ఫైనల్ మ్యాచ్‌లో బాలికల జట్టు మహబూబ్‌నగర్ జట్టుతో, బాలుర జట్టు మెదక్ జట్టుతో తలపడి ప్రథమస్థానంలో నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి తెలిపారు. తుప్రాన్ మండల విద్యాధికారి సత్యనారాయణ, టోర్నమెంట్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పరిశీలకుడు మార్కంటి గంగామోహన్, మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి రమేశ్ చేతుల మీదుగా ట్రోఫీ, బంగారు పతకాలు అందుకున్నారు. విజయం సాధించిన జిల్లా జట్లకు డీఈవో అశోక్ అభినందనలు తెలిపారు.

టీయూ పీజీ పరీక్షా కేంద్రం తనిఖీ

డిచ్‌పల్లి, జనవరి 31 : టీయూ పరిధిలో పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ) ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్ పరీక్షలు టీయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని టీయూ వీసీ ఆచార్య యాదగిరిరావు.. రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరితో కలిసి తనిఖీ చేశారు. పలు ప్రభుత్వ కళాశాలల్లో పరీక్షలు కొనసాగుతున్నట్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షలకు 2253 మంది విద్యార్థులకు 2140 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1739 మంది విద్యార్థులకు 1665 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు.

ఫుడ్ సైన్స్ కళాశాలలో అవగాహన

రుద్రూర్, జనవరి31 : మండలకేంద్రంలోని ఫుడ్ సైన్స్ కళాశాలలో మహిళలు నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై షీ టీం అధికారులు, ఎస్సై సాయన్న శుక్రవారం అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులతోపాటు టీ-సేఫ్ యాప్, డయల్ 100, గుడ్‌టచ్ -బ్యాడ్ టచ్, సైబర్‌నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ కల్పన, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రుద్రూర్, జనవరి 31 : అదృశ్యమైన వ్యక్తి మృతదేహం మండలంలోని అక్బర్‌నగర్ చెరువులో శుక్రవారం రాత్రి లభ్యమైంది. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్